నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, సోమవారం 29 ఏప్రిల్ 2024 | YADADRI BHUVANAGIRI



వలిగొండ మండలం రెడ్లరేపాకలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్, పక్కన మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి

- హామీల అమలు మరిచి మరోసారి మోసానికి యత్నం
- గ్రామాల్లో అడుగడుగునా నిలదీయాలి
- బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలం
- బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్

వలిగొండ, ఏప్రిల్28 : అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన వాగ్దాలను మరిచి, ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా మరోసారి మోసానికి ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్ అన్నారు. వలిగొండ మండలంలోని టేకులసోమారం, రెడ్లరేపాక, పులిగిల్ల, వెల్వర్తి, మొగిలిపాక, అరూరు, వేములకొండ, చిత్తాపురం, గొల్నెపల్లి, గోకారం, సంగెం, ఏదుళ్లగూడెం, నాతాళ్లగూడెం, వలిగొండ గ్రామాల్లో ఆదివారం మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డితో కలిసి బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యామ గుర్తుకు మల్లేశ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కార్తు ఓటు వేసి భువనగిరి పార్లమెంట్ నియోజక వర్గం నుంచి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం చేసే మోసాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. రైతుబంధు, రుణమాఫీని అమలు చేయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిలదీయాలన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి బీఆర్ఎస్ గెలుపుకోసం సైనికుల్లాగా పనిచేయాలని, పిలుపునిచ్చారు. తనను గెలిపిస్తే యువతకు ఉపాధి కల్పించే బాధ్యతతోపాటు పార్లమెంట్‌లో తెలంగాణ ప్రజల పక్షాన వినిపించే గొంతుక తనదేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, నాయకులు మొగుళ్ల శ్రీనివాస్, పనుమటి మమత నరేందర్‌రెడ్డి, కునపూరి కవిత, రేపాక ప్రదీప్‌రెడ్డి, డేగల పాండరి, సంజీవరెడ్డి, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

క్యామ మల్లేశ్ గెలుపునకు కృషి చేయాలి

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



బీఆర్ఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, చిత్రంలో జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి

రామన్నపేట, ఏప్రిల్ 28 : భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు కష్టపడి పని చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో యాదాద్రి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరుమర్తి మాట్లాడుతూ అధికారం, పదవులతో సంబంధం లేకుండా కష్టపడే ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ఈ విషయాన్ని బూత్ స్థాయిలో ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రజలు బీఆర్ఎస్ పార్టీని కోరుకుంటున్నారని, పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోశబోయిన మల్లేశం, ఎంపీటీసీ వేమవరపు సుధీర్‌బాబు, పట్టణ అధ్యక్షుడు పోతరాజు సాయికుమార్, నాయకులు బందెల రాములు, కన్నెబోయిన బలరాం, మాధవరెడ్డి, వెంకటేశ్, అశోక్, వెంకటేశం, చాంద్, స్వామి, యాదయ్య, సత్యప్రకాశ్, శ్రీనివాస్‌రెడ్డి, రాము, శివ, శ్రీనివాస్ రెడ్డి, నరేందర్, శ్రీధర్ పాల్గొన్నారు.

భువనగిరి మీదుగా వరంగల్ వెళ్లిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 28 : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్‌లో జరిగే రోడ్ షోకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదివారం సాయంత్రం ఎర్రవెల్లి ఫాంహౌస్ నుంచి బస్సులో బయల్దేరి తుర్కపల్లి, భువనగిరి, ఆలేరు, జనగాం మీదుగా వెళ్లారు. వివిధ వర్గాల ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రోడ్లు వెంట ఉండి జేజేలు పలికారు. కేసీఆర్ కూడా ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

తుర్కపల్లిలో ప్రజలకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

భువనగిరి కాంగ్రెస్‌లో చేరికల రగడ

'కాంగ్రెస్‌కు ద్రోహం చేసిన వారికి పార్టీలో చేర్చుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నం. స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమారెడ్డి అనుమతి లేకుండా గాంధీ భవన్‌లో పార్టీలో చేర్చుకోవడం ఏంటి..? ఏకాభిప్రాయంతో ఉన్న కార్యకర్తల మనోభావాలు దెబ్బ తీసేలా చేరికలు జరిగాయి. స్థానిక కాంగ్రెస్ నేతలు ఈ చేరికలను ఖండించాలి. లేని పక్షంలో కార్యాచరణ రూపొందించి పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం'

- ఇటీవల భువనగిరిలో నిరసన సందర్భంగా కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలివి..

'స్థానిక నేతల ఏకాభిప్రాయంతోనే చిన్నోడైనా.. పెద్దోడినైనా పార్టీలోకి చేర్చుకోవాలి. పార్టీలో చేర్చుకోవద్దని మేం అంటుంటే.. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి దగ్గరకు వెళ్లి కండువా కప్పుకొని, ఫొటోలు దిగడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నం. కార్యకర్తల మనోభావాల విరుద్ధంగా ప్రోత్సహించడం సరికాదు. ఆయన కూడా సరిచేసుకోవాలి. స్థానికుల ఏకాభిప్రాయం లేకుండా పార్టీలో చేరినవారి చేరికలు చెల్లవు'

- ఆదివారం ప్రెస్‌మీట్‌లో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు

పార్లమెంట్ ఎన్నికల వేళ భగ్గుమన్న విభేదాలు

- 'కుంభం'కు సంబంధం లేకుండా పార్టీలోకి..!
- గాంధీ భవన్‌లో జగ్గారెడ్డి సమక్షంలో చేరికలు
- తాజాగా రాజగోపాల్ రెడ్డిని కలిసిన జంపింగ్ లీడర్లు
- చేరికలను వ్యతిరేకిస్తున్న సీనియర్ నేతలు
- మొన్న రోడ్డుపై నిరసన.. నిన్న నాయకుల ప్రెస్‌మీట్
- స్థానికంగా సంప్రదించకుండా ఎట్ల చేర్చుకుంటారని ఆగ్రహం
- కాంగ్రెస్‌లో తాజా చేరికలు చెల్లవని వెల్లడి
- ఇట్లయితే పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తామని హెచ్చరిక..!

చేరికలను వ్యతిరేకిస్తూ 26న భువనగిరిలో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల వేళ కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలు మరోసారి రచ్చకెక్కాయి. నేతల మధ్య ఉన్న విభేదాలు బయటపడ్డాయి. ఇటీవల కాంగ్రెస్‌లో చేరికలను స్థానిక ఆ పార్టీ నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తమతోపాటు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అనుమతి లేకుండా ఎట్లా చేర్చుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొన్న భువనగిరి పట్టణంలో ఆ పార్టీ నేతలు రోడ్డుపై నిరసన వ్యక్తం చేయగా, ఆదివారం ఏకంగా ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి తూర్పారబట్టారు.

స్థానిక ఎమ్మెల్యేకు సంబంధం లేకుండా..

కాంగ్రెస్ అంటేనే అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ. ఆ పార్టీలో నిత్యం కుమ్ములాటలు, అంతర్గత విభేదాలు షరామామూలే. తాజాగా మరో కొత్త పంచాయితీ రచ్చకెక్కింది. సాధారణంగా సదరు నియోజకవర్గ పరిధిలో చేరికలను స్థానిక ఎమ్మెల్యే అనుమతితో జరుగుతుంటాయి. ఆయన గ్రీన్ సిగ్నల్ ఇస్తేనే కొత్త వారిని చేర్చుకుంటారు. కానీ ఇటీవల ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన అందెం లింగం యాదవ్‌తోపాటు గోద శ్రీనివాస్, గోద రాహుల్, చిన్నం శ్రీనివాస్ తదితరులు గాంధీభవన్‌లో సీనియర్ నేత జగ్గారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఇక్కడే అసలు పంచాయితీ షురూ అయ్యింది. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డితోపాటు స్థానిక నాయకత్వానికి సంబంధం లేకుండా చేరారని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఇది పెద్ద దుమారంగా మారింది.

భువనగిరిలో 'మునుగోడు' జోక్యం..!

భువనగిరి నియోజకవర్గంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పదేపదే జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణ ఉంది. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన సదరు నేతలు కనీసం కుంభం అనిల్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలువలేదు. పైగా ఆదివారం రాజగోపాల్ రెడ్డిని కలిసి కండువాలు కప్పి, పుష్పగుచ్చం అందిస్తున్న ఫొటోలు దిగి.. స్థానిక సోషల్ మీడియా గ్రూపుల్లో షేర్ చేశారు. ఇది అగ్నికి మరింత ఆజ్యం పోసినట్లయ్యింది. తమకు రాజగోపాల్ రెడ్డి ఆశీస్సులు ఉన్నాయని చెప్పుకొనే ప్రయత్నం చేశారు. దీంతో కాంగ్రెస్ నేతలు రాజగోపాల్‌రెడ్డిపైనా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యకర్తల మనోభావాలకు విరుద్ధంగా ప్రోత్సహించడం సరికాదని, ఆయన కూడా సరి చేసుకోవాలని హితవు పలుకుతున్నారు.

చేరికలు చెల్లవు..

సదరు నేతల చేరికలపై స్థానిక నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఎవరి అభిప్రాయంతో పార్టీలో చేరారని, చేర్చుకున్నారని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర నాయకత్వం పైనా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేరికలను వ్యతిరేకిస్తూ ఈ నెల 26న భువనగిరి పట్టణంలోని అంబేద్కర్ చౌరాస్తా వద్ద రోడ్డుపై కాంగ్రెస్ భువనగిరి మండల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. చేరికలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు స్పష్టం చేశారు. తాజాగా ఆదివారం మళ్లీ కాంగ్రెస్ నేతలంతా కలిసి ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారు. సదరు నేతల చేరికలు చెల్లవని స్పష్టం చేశారు. ఇప్పుడు భువనగిరి నియోజకవర్గంలో ఇదే హాట్ టాపిక్‌గా మారింది. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేసిన బీబీనగర్ జడ్పీటీసీ గోళి ప్రణీతా పింగళ్ రెడ్డితోపాటు ఇతర నేతలను మాత్రం చేర్చుకున్నారని, ఇప్పుడు బీసీ సామాజిక వర్గం నేతలు కావడంతోనే అడ్డుకుంటున్నారనే ప్రచారం కూడా జరుగుతున్నది.

పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తామని హెచ్చరిక..!

ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నాయి. గెలుపు కోసం కాంగ్రెస్ ఆపసోపాలు పడుతున్నది. ఇలాంటి తరుణంలో విభేదాలు బయటకు రావడంతో కేడర్‌లో గందరగోళం నెలకొంది. బహిరంగంగా రగడ రేగడంతో ప్రజల్లో అసహనం వ్యక్తమవుతున్నది. కాంగ్రెస్‌ను గెలిపిస్తే అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టడం కంటే పార్టీ గొడవలతోనే సరిపోతుందనే భావన కలుగుతున్నది. మరోవైపు తాజా చేరికలను ఆపకపోతే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తామని, ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని ఆ పార్టీ నేతలే హెచ్చరిస్తుండటం విశేషం.

నల్లగొండ పార్లమెంట్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే పోరు

నామ మాత్రంగా కూడా కనిపించని బీజేపీ

- సొంత పార్టీలో లేని సహకారం..
- ఏకాకిగా బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డి
- కేసీఆర్ బస్సు యాత్రతో గులాబీ పార్టీకి పెరిగిన క్రేజ్

సూర్యాపేట, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : నల్లగొండ పార్లమెంట్‌కు జరుగబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యనే పోరు కనిపిస్తున్నది. బీజేపీ నామమాత్రంగా కూడా కనిపించడం లేదు. బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి పార్టీ మారి టిక్కెట్ తెచ్చుకున్నాడు తప్ప ఆ పార్టీ స్థానిక నాయకత్వం నుంచి ఏ మాత్రం సహకారం లేదు. సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల్లో బీజేపీ జెండాలు మచ్చుకు కూడా కనిపించడం లేదు. హుజూర్‌నగర్‌తో పాటు నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లో అంతంత మాత్రంగానే ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తన వెంట వస్తారనుకున్న సైదిరెడ్డికి మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యుడు జగదీశ్‌రెడ్డి చాతుర్యంతో ఒక్కరు కూడా వెళ్లలేదు. కాగా మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మిర్యాలగూడ, సూర్యాపేటలో చేపట్టిన బస్సుయాత్రతో గులాబీ పార్టీకి క్రేజ్ పెరిగింది. సాగు, తాగు నీరు రాకపోవడం, విద్యుత్ కోతలు, రైతుబంధు కట్, రుణమాఫీ చేయకపోవడం తదితర కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలపై కేసీఆర్ వివరించడంతో పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలనే ఆలోచనలో ప్రజలు ఉన్నారు. బీఆర్ఎస్‌కు జనం మద్దతు, కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యేల బలం ఉండగా ప్రచారంలో ఆ రెండు పార్టీల జెండాలే దర్శనమిస్తున్నాయి. బీజేపీ అయితే ఏకాకి అయినట్లు కనిపిస్తున్నది.

పాత కేడర్ నుంచి సైదిరెడ్డికి లభించని సహకారం

సూర్యాపేట జిల్లా పరిధిలోని బీజేపీ పాత కేడర్ నుంచి అభ్యర్థి శానంపూడికి ఆశించిన స్థాయిలో కాదు అసలు సహకారమే లేదని చెప్పవచ్చు. జిల్లా బీజేపీలో తొంభై శాతం సైదిరెడ్డిని వ్యతిరేకిస్తున్నారు. నల్లగొండ ఎంపీ అభ్యర్థిత్వాన్ని మార్చాలని అధిష్టానం వద్ద పట్టుబట్టినట్లు ప్రచారం కూడా జరిగిన విషయం విదితమే. ఇక పార్టీ మారిన తరువాత సైదిరెడ్డి హుజూర్‌నగర్‌తోపాటు ఇతర నియోజకవర్గాల్లోని బీఆర్ఎస్‌తోపాటు ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తల కోసం రెండు మూడు వారాలపాటు ఎన్ని ఫోన్లు చేసినా ఫలితం లేకపోయింది. కొద్ది రోజులుగా కలిసి వచ్చే కొద్దిమందితో గుళ్లు, గోపురాలు తిరుగుతూ నల్లగొండ జిల్లా కేంద్రంతోపాటు ఆ జిల్లా పరిధిలోని నియోజకవర్గాల్లో ఒకటి రెండు సార్లు సమావేశాలు, ఉన్న ఒకరిద్దరితో ఒకటి, రెండు గ్రామాల్లో పర్యటించి వెళ్తున్నారు. ఇటీవల నల్లగొండలో బీజేపీ పార్లమెంటరీ నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహిస్తే నాగార్జునసాగర్ ఇన్‌చార్జి కంకణాల నివేదితారెడ్డి మినహా మిగిలిన ఆరు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు హాజరుకాలేదు. కాగా సైదిరెడ్డికి టిక్కెట్ వచ్చిన తరువాత ఇప్పటి వరకు కూడా బీజేపీ సీనియర్ నాయకులు సంకినేని వెంకటేశ్వర్‌రావు, గొంగిడి మనోహర్‌రెడ్డి, జుట్టుకొండ సత్యనారాయణతోపాటు నల్లగొండ, సూర్యాపేట జిల్లా నాయకులు పత్తాలేరు. సంకినేని వెంకటేశ్వర్‌రావుకు అసెంబ్లీ ఎన్నికల్లో 40వేల ఓట్లు రాగా ఈ సారి ఆ ఊపే కనిపించడం లేదు. సీనియర్లు మొత్తం అసంతృప్తితో ఉండగా పార్టీ అధిష్టానం కూడా పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. దాంతో అభ్యర్థి సైదిరెడ్డి ఓ పదిమందిని వెంటేసుకొని పర్యటిస్తున్నారు. తన సొంత నియోజకవర్గం అయిన హుజూర్‌నగర్‌లో బీఆర్ఎస్ శ్రేణులు ఒక్కరూ కూడా ఆయన వెంట లేరు. అంతా బీఆర్ఎస్‌లోనే ఉన్నారు.

నాటి గొడవతో అసంతృప్తి

నాటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రజాసంగ్రామ యాత్రలో భాగంగా మఠంపల్లి మండలంలో భూములు కబ్జా చేశారని అక్కడ ఉన్న ఫెన్సింగ్‌లను తొలగించడంతో బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఓ యుద్ధమే జరిగింది. అప్పుడు బీజేపీ నాయకులపై కేసులు కాగా దానికి కారణమైన సైదిరెడ్డిని పార్టీలో చేర్చుకోవడం పట్ల జిల్లా బీజేపీలో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. సైదిరెడ్డికి నల్లగొండ పార్లమెంట్ టికెట్ వచ్చి 50 రోజులు గడుస్తున్నప్పటికీ సూర్యాపేటలో అడుగు కూడా పెట్టకపోగా కోదాడ, నాగార్జునసాగర్, దేవరకొండ నియోజకవర్గాల్లో ఒకటి రెండు సార్లు మాత్రమే వెళ్లారు. ఇక బీజేపీకి ఎంతో సేవలు అందించిన గుండగోని మైసయ్య వర్ధంతి సభకు సైదిరెడ్డి హాజరుకాలేదు. దాంతో పార్టీలో బీసీలకు విలువ లేదా అని గొంతెత్తిన బీజేపీ జిల్లా మీడియా కన్వీనర్‌గా పనిచేసిన పాలకూరి రవితోపాటు ఆయన భార్య రమాదేవి ఇద్దరూ ఇండిపెండెంట్లుగా నామినేషన్లు వేశారు. అంతేకాకుండా సీనియర్ నాయకులు నూకల నర్సింహారెడ్డి కూడా ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశారంటే సైదిరెడ్డికి బీజేపీలో ఏమాత్రం సహకారం ఉందో అర్థమవుతుంది. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో బీజేపీ ఆనవాళ్లు అంతంత మాత్రంగా కూడా కనిపించకపోగా, అనేక వైఫల్యాలతో కాంగ్రెస్ పార్టీ ముక్కుతూ మూలుగుతూ ముందుకు సాగుతున్నది. కేసీఆర్ బస్సుయాత్రతో బీఆర్ఎస్ మాత్రం ముందంజలో కనిపిస్తున్నది.

కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడం ఖాయం

కేసీఆర్ సాగు నీళ్లు తెస్తే.. కాంగ్రెస్ కన్నీళ్లు తెచ్చింది

- ముల్లు కర్రతో గుచ్చితేనే ఈ ప్రభుత్వానికి మేలుకొలుపు
- బీఆర్ఎస్ అభ్యర్థి కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- ఉత్తమ్ నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్నా జిల్లాకు చేసిందేమీ లేదు
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



ఎన్నికల ప్రచారంలో భాగంగా మోతెలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

మోతె/ నడిగూడెం, ఏప్రిల్ 28 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడం ఖాయమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మోతె, నడిగూడెం మండల కేంద్రాల్లో ఆదివారం సాయంత్రం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కాలం తెచ్చిన కరువు కాదిది.. కాంగ్రెస్ తెచ్చిన కరువు అన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చి రైతు పొలాలకు నీళ్లు తెస్తే.. కాంగ్రెస్ సర్కారు వచ్చి రైతుల కళ్లలో నీళ్లు తెచ్చిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో మోతె మండలానికి కాళేశ్వరం ద్వారా రెండు పంటలకు నీరు అందించి సస్యశ్యామలం చేశామని చెప్పారు. ఎవరికి వేసిన ఓటు మంచి చేసిందో ఆలోచించాలని ప్రజలకు సూచించారు. కాంగ్రెస్ వాళ్లను ముళ్లకర్రతో గుచ్చి అనగపెట్టి పని చేయించుకోవాలని, లేకుంటే వాళ్లకు పని చేసే చేతకాదని అన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ అంటే నమ్మి ఓటేస్తే రైతు బంధు ఇవ్వలేదని, ఎకరాకు రూ.15వేలు ఎక్కడ పోయాయని ప్రశ్నించారు. వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్, మహిళలకు రూ.2500, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం, నిరుద్యోగులకు రూ.4వేల భృతి ఇస్తామని చెప్పి ఇప్పటికీ నెరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కాలేజీ విద్యార్థినులకు డిసెంబర్ 9న ప్రియాంకగాంధీ లక్ష స్కూటీలు ఇస్తామని చెప్పారు.. వచ్చాయా? అని అక్కడి ప్రజలను ప్రశ్నించారు. ఆటో కార్మికులకు రూ.12వేలు ఇస్తామని చెప్పి బువ్వకు కూడా లేకుండా చేశారని ఆరోపించారు. రూ.4వేల పెన్షన్ ఇస్తామని చెప్పి ఇవ్వకుండా ముసలోల్లను కూడా మోసం చేశారని అన్నారు. కాళేశ్వరం జలాలతో రైతులకు నీరు అందించి ఆదుకున్నామని, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీటి పారుదల శాఖ మంత్రిగా ఉండి ఇక్కడి పొలాలను ఎండబెట్టారని తెలిపారు. ఉత్తమ్ కుమార్‌రెడ్డి మంత్రిగా అందించిన బహుమానం 12నుంచి 14లక్షల ఎకరాలు ఎండబెట్టడమేనని ఎద్దేవా చేశారు. అదే కేసీఆర్ గెలిచి ఉంటే ఈ రోజు మన నీళ్లు మనకు వచ్చేవని.. మన సంక్షేమ నిధులు మనకు అందేవని అన్నారు. బీఆర్ఎస్ పార్టీనే శ్రీరామరక్ష అని, కారు గుర్తుకు ఓటు వేసి కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, ఎంపీపీ యాతాకుల జ్యోతి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు శీలం సైదులు, నర్సిరెడ్డి, నాయకులు చంద్రయ్య, ఆంజనేయులు, మహేశ్, ఖలీల్ అహ్మద్, మధుసూదన్‌రెడ్డి, లింగారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, సతీశ్, మల్సూర్, ముత్తయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు నామినేషన్ల ఉపసంహరణ

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 28 : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి సోమవారం నామినేషన్ల ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు కొనసాగనుంది. ఈ నెల 18 నుంచి 25వరకు కొనసాగిన నామినేషన్ల ప్రక్రియలో వివిధ పార్టీలకు చెందిన 61మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 26న పరిశీలన నిర్వహించగా.. 10మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 51 నామినేషన్లు ఆమోదం పొందాయి. నామినేషన్ల ఉపసంహరణకు సోమవారం వరకు గడువు ఉండగా.. ఎంత మంది అభ్యర్థులు పోటీ నుంచి తప్పుకుంటారో వేచి చూడాలి. అదేవిధంగా పోటీలో నిలిచే అభ్యర్థులకు ఎన్నికల అధికారులు గుర్తులను కేటాయించనున్నారు.